క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న బౌద్ధ ప్రచారకుడు ధర్మానంద

మల్కాపురం: మొక్కల పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని బౌద్ధ ప్రచారకుడు ధర్మానంద అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆయన మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెట్టు ప్రగతికి మెట్టు అని అన్నారు. మొక్కల పెంపకం వల్ల ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

10న అంతర్ జిల్లాల ఆర్చరీ ఎంపిక పోటీలు

పరవాడ: ఈ నెల 10న ఉదయం 10 గంటలకు అంతర్ జిల్లాల జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చర్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.నిశాంత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆర్చర్లు తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువ పత్రం వెంట తీసుకురావాలని కోరారు.

గాజువాక ఎన్‌ఏసీలో జాబ్ మేళా రేపు

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో గాజువాక (పెదగంట్యాడ) ఎన్‌ఏసీ కేంద్రంలో 9న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో నిపునా ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్, హెటిరో లాబ్స్, యాక్సిస్ బ్యాంక్ (క్యూస్ కార్ప్), డీమార్ట్ పాల్గొంటాయని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ ఎలక్ట్రీషియన్, డిప్లమో ఎలక్ట్రికల్, బీఎస్‌సీ కెమిస్ట్రీ, కంప్యూటర్స్, బీకామ్ కంప్యూటర్స్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, నక్కపల్లిలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 79810 22453లో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానమైన ఫోన్ నంబర్ తీసుకురావాలని ఆయన సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూ కాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్, కేఎన్‌ఎం గరల్స్ హైస్కూల్‌లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విశాఖపట్నం సెక్రటరీ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు వివరించారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.సన్యాసిరావు, కె.రాము, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్స్ వద్దు

సీతంపేట : పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులు విడనాడి గుడ్డ సంచులు, పేపర్ బ్యాగ్స్ వాడాలని జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.వి.లక్ష్మీనారాయణ సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై నరసింహనగర్ రైతుబజార్‌లో జీవీఎంసీ సిబ్బందితో కలిసి వినియోగదారులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు భూమిలో కలవడానికి వందేళ్లకు పైగా సమయం పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు, భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఇచ్చేలా ప్రతి ఒక్కరూ గుడ్డ, నార, కాగితం సంచులు వాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచితో బజార్‌కు వచ్చిన వినియోగదారులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు.

దిన దిన గండం.. నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా మారింది వారి పరిస్థితి. ఇంటి నుంచి బయట ప్రాంతానికి వెళ్లాలంటే ప్రమాదానికి ఎదురొడ్డాల్సిందే.. అష్టకష్టాలు పడాల్సిందే.. ఇది ఏదో ఒక రోజు సమస్య అయితే ఓకే... కంచరపాలెం పరిధిలోని పలు కాలనీ వాసుల నిత్య సమస్య ఇది.. గమ్యం చేరాలన్న తొందరలో కొంత మంది రైళ్ల రాకపోకలు గమనించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దశాబ్దాల తరబడి ఉన్న ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నా అటు రైల్వే అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు పర్యటనలతో కాలం గడిపేస్తున్నారు. దీంతో తమకు ఇంకా ఎన్నాళ్లీ ఎదురీత అని ఆయా కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దయానంద నగర్‌లో పట్టాలు దాటుతున్న ప్రజలు

ఎన్నాళ్లీ ఎదురీత?

- ప్రమాదాలకు ఎదురొడ్డి రాకపోకలు
- కంచరపాలెం వాసుల కష్టాలు
- అండర్ పాత్‌వే కోసం వినతులు
- స్పందించని అధికారులు

కంచరపాలెం: కంచరపాలెం ప్రధాన రహదారి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పలు ప్రాంతాల వాసులు ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. రైలు పట్టాలకు అవతల నివాస ప్రాంతాలైన ముత్యమాంబ కాలనీ, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ కాలనీల వాసులు వరుసగా ఆరేడు లైన్ల రైల్వే ట్రాకులు దాటాలి. ఇక రామ్మూర్తిపంతులపేట, గవర కంచరపాలెం, దోబీలైన్ గొల్లకంచరపాలెం, కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డుకు రావా లంటే ప్రజలు రెండు మూడు ట్రాకులు దాటి గమ్యాలకు చేరుకోవాలి. రక్షణ లేని రైలు ట్రాకులు దాటి గమ్యస్థానాలు చేరేందుకు పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఇక్కడ ఫీట్లు చేయాల్సిందే!. ఆయా ప్రాంతాలకు వచ్చే అతిథుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రైల్వే ట్రాక్‌లపై అవగాహన లేని ఆయా కాలనీలకు చెందిన బంధువులు ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారు. రైలింజన్ల నిర్వహణ, మరమ్మతుల విభాగాలు, రైల్వే బోగీల వాషింగ్ ఇక్కడే ఏర్పాటు చేయడంతో రోజులో అన్ని సమయాల్లో రైళ్లు తిరుగుతుంటాయి.

ఆ దారి వినియోగానికి దూరం

గతంలో పాదచారులకు ఆర్పీపేట పేరిట అండర్ పాత్ వే నిర్మాణం చేపట్టారు. రహదారి అధ్వానంగా ఉండడంతో పాదచారులు అటుగా నడవడానికి మొగ్గు చూపడం లేదు. ప్రమాదమని హెచ్చరించినా రైల్వే ట్రాకులు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ కష్టాలకు మోక్షం కల్పించేలా రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు అండర్ పాత్‌వే నిర్మించాలని నివాసితులు కోరుతున్నారు.



ఆర్పీపేట రైల్వేగేటు సమీపంలో రైళ్ల రాకపోకల సమయాల్లో స్థానికుల పాట్లు

అండర్ పాత్ వే నిర్మించాలి

కంచరపాలెం ప్రజలకు రైల్వే పట్టాల సమస్య నుంచి విముక్తి కోసం ఎదురు చూస్తున్నాం. ఆయా కాలనీలకు వెళ్లాలంటే కిలో మీటర్ల మేర నడాల్సివస్తుంది. పాదచారుల కోసం అండర్ పాత్ వే నిర్మించాలి. సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించాం. అయినా మా మొర వినలేదు.
– వెంకటేష్, రాజీవ్‌కాలనీ, కంచరపాలెం.



పైడిమాంబకాలనీ రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు, పాదచారులు

అధికారులు స్పందించాలి

అండర్ పాత్ వే నిర్మాణం కోసం రైల్వే ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం. రైలు పట్టాలు దాటాలంటే నిత్యం నరకయాతన అవుతుంది. ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో స్పందన కనిపించడం లేదు. పిల్లలను బయటకు పంపాలంటే భయంగా ఉంటుంది. అధికారులు స్పందించి అండర్ పాత్‌వే నిర్మాణానికి కృషి చేయాలి. – రత్నకుమారి, దయానందనగర్, కంచరపాలెం.

అక్కడ వెలుగు.. ఇక్కడ చీకటి

ఇబ్బంది పడుతున్న వాహనదారులు



నేవల్ ఏరియాలో విరజిమ్ముతున్న వెలుగులు



సివిలియన్స్ ఏరియాలో అక్కడక్కడ కనిపిస్తున్న వెలుగులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ఓ రోడ్డులో వెలుగులు విరజిమ్ముతున్నాయి. మరో మార్గంలో చీకట్లు కమ్ముకున్నాయి.దీంతో వాహన చోదకులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి...
జింక్ నుంచి సింధియా వరకు సేవా మార్గాన్ని ఐదేళ్ల కిందట విస్తరించారు. ఆ సమయంలో సేవా మార్గానికి మధ్య డివైడర్ ఏర్పాటు చేసి పచ్చటి వాతావరణం కోసం చెట్ల పెంచడంతో పాటు మధ్య మధ్యలో విద్యుత్ షో ల్యాంప్స్ ఏర్పాటు చేశారు. అయితే నౌసేనాభాగ్ నుండి సింధియా వరకూ వెలుగులు విరజిమ్ముతున్నాయి. అదే మహాలక్ష్మి సినిమా థియేటర్ నుంచి జింక్ వరకు సాధారణ ప్రజలు ఉండే మార్గంలో మాత్రం అక్కడక్కడే వెలుగులు కనిపిస్తాయి. కొన్ని లైట్లు వెలగక పోయినా పట్టించుకోవడం లేదు.

అడ్డంకిగా మారిన చెట్ల కొమ్మలు
అసలే అరకొర లైట్లు వెలుగుతుండగా.. చెట్ల కొమ్మలు అడ్డురావడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొమ్మలు విద్యుత్ షో ల్యాంప్స్‌కు అడ్డంగా ఉండడంతో ఆ మార్గం చీకటి మయంగా ఉంటుంది. అదే నేవల్ ఏరియా అయిన నౌసేనాభాగ్ నుంచి సింధియా వరకు షో ల్యాంప్స్ ఎక్కడ వెలగకున్నా క్షణాల్లో మార్చే అధికారులు సాధారణ పౌరుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



లైట్లకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు

కార్మికుల సస్పెన్షన్ రద్దు చేసే వరకు పోరాటం



మాట్లాడుతున్న ఏఐడీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్



దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో కార్మికులు 36 మందిపై సస్పెన్షన్ వేటు వేయడం యాజమాన్యం కక్షసాధింపు చర్యే అని ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఐడీఈఎఫ్) ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ అన్నారు. ఈ మేరకు ఎన్ఏడీ మెయిన్ గేటు సమీపంలో దీక్ష శిబిరం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాటంలో ఏఐడీఈఎఫ్ ముందుంటుందన్నారు. కార్మికుల సస్పెన్షన్‌ను రద్దు చేయించి అందరికీ న్యాయం చేసే వరకు పోరాడుతామన్నారు. దీన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తామన్నారు. 36 మందిని సస్పెండ్ చేయడం వల్ల 80 శాతం మంది ఉద్యోగులు సంతోషంగా ఉన్నారని చెప్పడం చాలా శోచనీయమన్నారు. కార్మికులకు అండగా ఎన్ఏడీ ఉద్యోగులంతా ఉన్నారన్నారు. యాజమాన్యం కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఏడీ సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏవీ థామస్, ఏఐడీఈఎఫ్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గోపాలకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చుతరావు, సీఈ యూనియన్ నాయకులు ఎస్‌కే మలాలి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో అడ్డగోలు పార్కింగ్

విశాఖ విద్య: గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని కొంత మంది సొంత వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారు. జీవీఎంసీ 52వ వార్డు పరిధి ఎన్ఎస్‌టీఎల్‌కు ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్ స్థలంలో ప్రస్తుతం ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రీన్‌బెల్ట్ కోసమని కేటాయించిన స్థలాన్ని కొంతమంది తమ స్వాధీనంలో ఉంచుకొని, అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ ఉన్న రెస్టారెంట్లు, బార్ షాపు, ఇతర దుకాణాల వద్దకు వచ్చే వారు గ్రీన్ బెల్ట్ స్థలంలోనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. భారీ వాహనాలు సైతం ఇక్కడ రోజుల తరబడి పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ ద్వారా పెద్ద మొత్తంలో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎంతో కృషి చేస్తున్నారు. పచ్చదనం పెంపొందించేలా పలు చోట్ల గ్రీన్ బెల్ట్‌ను అభివృద్ధి చేశారు. కానీ ఎన్ఎస్‌టీఎల్‌కు ఎదురుగా ఉన్న గ్రీన్‌బెల్ట్ స్థలం మాత్రం కొంతమంది ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీనిపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి, గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని పరిరక్షించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



గ్రీన్ బెల్ట్ స్థలంలో పార్కింగ్ చేసిన వాహనాలు

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు



పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి



తిరువీధిలో గోదాదేవి అమ్మవారికి హారతి అందిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని శోభాయమానంగా అలంకరించి బంగారుచాయ పల్లకీలో అధిష్టింపజేశారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆలయ బేడా మండపంలో విశేషంగా తిరువీధి జరిపారు. షోడపోపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి ఆలయ బేడామండపంలో విశేషంగా తిరువీధి చేపట్టారు. అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నపం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

శ్మశానవాటికలో వ్యర్థాల తొలగింపు

మల్కాపురం: కోరమాండల్ సమీపంలోని హిందూ శ్మశానవాటికలో సమస్యలపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వసతులు లేమి...,పరిసరాలు దయనీయంగా ఉండడంతో ఆఖరి మజిలీకీ అవస్థలే అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వార్డు పారిశుధ్య కార్మికులతో పాటు బాబ్ కాట్‌తో శ్మశానవాటికలో వ్యర్థాలు మొత్తం తొలగించారు.దీంతో పలువురు సాక్షికి అభినందనలు తెలిపారు.



శ్మశానవాటికలో వ్యర్థాలు తొలగిస్తున్న బాబ్‌కాట్

వైద్య సేవల్లో ఆశ కార్యకర్తలు కీలకం

సీతంపేట : సీజనల్ వ్యాధులు అదుపు చేయడంలో క్షేత్ర స్థాయిలో ఆశ కార్యకర్తల సేవలు కీలకమని జిల్లా మలేరియా నివారణ విభాగం ఎంపీహెచ్ఈవో శేషుబాబు అన్నారు. నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులను వ్యాప్తి చేసే దోమల నియంత్రణకు మంగళవారం, శుక్రవారం, శనివారం ఫ్రై డే డ్రై డే పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించాలని సూచించారు. నిల్వ నీటిలో దోమ లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తిస్తే ఆ నీటిని పారబోయించాలని తెలిపారు. దోమల వృద్ధిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు అర్హులందరికీ చేరేలా ఆశ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. వ్యాక్సినేషన్, ఫ్రై డే డ్రై డే, కమ్యూనికబుల్ డిసీజెస్ నియంత్రణలో ఆశ కార్యకర్తలు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈవో శేషుబాబు

భగవద్గీతలో మానవ జీవన సారాంశం

బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి

మురళీనగర్ : భగవద్గీతలో మానవ జీవన సారాంశం ఇమిడి ఉందని పలువురు విదేశీయులు పేర్కొన్నారు. స్థానిక బాలభాను పాఠశాల విద్యార్థులతో కలిసి భగవద్గీత శ్లోకాలు పఠించారు. నగరంలో నిర్వహించనున్న గురు పూజోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన విదేశీయులు మురళీనగర్ సెక్టార్ – 8లోని బాలభాను విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. స్పెయిన్, అర్జెంటీనా, అమెరికా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియాకు చెందిన 30 మంది ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్న గురుపూజోత్సవంలో పాల్గొనేందుకు విశాఖ నగరానికి వచ్చారు. ఈ మేరకు వీరు బాలభాను పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి భవిష్యత్ లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. భారతీయ సమాజంలోని గొప్పతనాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. భారతీయుల ఆచార వ్యవహారాలంటే తమకు ఎంతో ఇష్టమన్నారు. బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ బీఆర్ కే రాజు, జగద్గురు పీఠం భౌగోళిక చైర్మన్ కె.గురు ప్రసాద్, పాఠశాల డైరెక్టర్ వి.పార్వతి, పి.రవిశంకర్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ సంచాలకుడు సీహెచ్ రమణారావుతో వీరు ఆధ్యాత్మిక అంశాలు, విద్యా బోధన తదితర అంశాలపై చర్చించారు.



బాలభాను పాఠశాలను సందర్శించిన విదేశీయులు

రూ. 2 లక్షల నగదు అపహరణ

మల్కాపురం: జీవీఎంసీ 63వ వార్డు చింతల లోవ గ్రామంలోని ఓ ఇంటిలో దొంగ ప్రవేశించి రూ.2 లక్షల నగదు, వెండి వస్తువులు అపహరించుకుపోయాడు. క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎన్.రాజేష్ అనే వ్యక్తి మూడు అంతస్తుల భవనంలో నివసిస్తున్నారు. సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత రెండో ఫ్లోర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటాక మంగళవారం తెల్లవారుజామున శబ్దం రావడంతో రాజేష్ మూడో ఫ్లోర్‌కు వెళ్లి చూడగా... గది తాళం, బీరువా విరగ్గొట్టి ఉండడంతోపాటు రూ.2 లక్షల నగదు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో ఆందోళనకు గురై చుట్టుపక్కల పరిశీలించాడు. ఆ సమయంలో డాబాపై మొక్కల చాటున దాక్కున్న దొంగను రాజేష్ పట్టుకునేందుకు ప్రయత్నించడంతో తప్పించుకుని పారిపోయాడు. దీంతో బాధితుడు క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



దొంగ విరగొట్టిన ఇంటి గోడ, బీరువా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లో పతంజలి యోగ సమితి వారి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత షుగర్ వ్యాధి నివారణ చికిత్స కేంద్రాన్ని శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల శరీరంలో అనేక మార్పులు సంభవిస్తాయని, షుగర్ వ్యాధి నివారణకు యోగా దోహదపడుతుందన్నారు. శారీరక ఆరోగ్యానికి, మెరుగైన జీవనానికి అత్యంత శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుందని, ప్రతీ ఒక్కరూ సాధన చేయాలని సూచించారు.

విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అన్నారు. చినగదిలి మండలంలోని శ్రీ కళాష్ ఎడ్యుకేషన్ స్కిల్స్ సెంటర్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరూ విద్యలో నైపుణ్యం సాధించేలా ఆటపాటలతో బోధన సాగించాలన్నారు. పిల్లలకు పునాది స్థాయిలోనే అద్భుతమైన విద్యాబోధన జరగాలని, అప్పుడే మనం అనుకున్న రీతిలో పిల్లలు ఎదుగుతారని చెప్పారు. దాని పునాది అయిన శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏఎంవో లక్ష్మి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: ఎన్ఏడీ బ్రిడ్జి సమీపంలో గాంధీనగర్ వద్ద రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు.. ఎన్ఏడీ సమీపంలో గల గాంధీనగర్ రైల్వే ట్రాక్‌పై మంగళవారం మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియన వ్యక్తి ట్రాక్ దాటేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొన్నట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటుందని అంచనా వేశారు. అతని వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం స్టేషన్‌లో గల గవర్నమెంట్‌రైల్వే పోలీసులకు తెలియజేయాలని కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం